రాజ్యాంగ విధుల పరిరక్షణ బాధ్యత మనదే

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సభలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్
- వివిధ రంగాల ప్రముఖులకు అంబేడ్కర్ విశిష్ట సేవా పురస్కారాల ప్రదానం
- వేర్వేరు ప్రాంతాల్లో రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు



అంబేడ్కర్ విశిష్ట సేవాపురస్కార గ్రహీతలతో మాజీ ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలి: 'భారతరత్న' డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ విధుల పరిరక్షణ బాధ్యత మనదేనని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ సెంటరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సభకు ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి శివకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే మన దేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతోందని గుర్తు చేశారు. అన్ని వర్గాల సమానత్వాన్ని రాజ్యాంగంలో పొందుపరచిన అంబేడ్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదని చెప్పారు.

ఆ మహోన్నతుడి ఆశయాలకు అనుగుణంగా పరిపాలన చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా చేసినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. ఇరవై ఏళ్లుగా అన్ని వర్గాల్లో సామరస్యం కోసం ఐక్యవేదిక కృషిచేస్తుండటం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తన ప్రసంగంలో అంబేడ్కర్ ఆలోచనలను, ఆశయాలను కొనసాగించటమే ఆయనకిచ్చే నివాళిగా చెప్పారు. ప్రముఖ న్యాయవాది కనపర్తి బెన్‌హర్ నిర్వహణలో వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఐక్యవేదిక తరఫున అంబేడ్కర్ విశిష్ట సేవా పురస్కారాలను ఎమ్మెల్యే శివకుమార్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. డాక్టర్ ఆలపాటి సందీప్, కాటూరి వెంకటేశ్వరరావు, జెట్టి శివరామకృష్ణప్రసాద్, బీఎల్ నారాయణ, కొలవరపు దేవయ్య, గల్లా జ్ఞానశేఖర్, కనపర్తి రత్నాకర్, ఆళ్లమూడి ప్రభాకర్, యందేటి వెంకటసుబ్బయ్య, రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ రమణ, బండికళ్ల సతీష్, ఆరాధ్యుల కన్నా, షేక్ సాదిక్, షేక్ సుభాని పురస్కారాలను స్వీకరించినవారిలో ఉన్నారు. డాక్టర్ గర్నెపూడి హేమీమ, జంగం శ్యామ్, ఇరిగేషన్ అనిల్, యనమల ఈశ్వర్, బచ్చనబోయిన శ్రీనివాసరావు, దేవరకొండ శంకర్, ప్రసాదం సురేష్, కఠారి హరీష్, కాకి దేవసహాయం మాట్లాడారు. ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో....

తెనాలిటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు దేశ ప్రజల గుండెల్లో చిరస్మరణీయమని కాంగ్రెస్‌పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో సోమ వారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ న్యాయశాఖమంత్రిగా కాంగ్రెస్‌పార్టీ హయాంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పనిచేసినట్లు వెల్లడించారు. ఆ సమయంలోనే ఆయన భారత రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. దేశ ప్రజలందరూ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలతో జీవిస్తున్నారంటే ఆయన రాసిన రాజ్యాంగ ఫలితమేనని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును చట్టబద్ధం చేయడాన్ని తప్పుపట్టారు. ముస్లిం సమాజం మనోభావాలను గౌరవించకుండా దుర్మార్గంగా పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దీనికి మద్దతు తెలిపిందని ఆరోపించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కూటమి కుట్రలను ఎండగట్టాలని పిలుపునిచ్చార. కార్యక్రమంలో కె.బుల్లయ్య, ద్వారక శ్రీను, ఎం.పూర్ణచంద్రరావు, పెనుగొండ శివకుమార్ భీమరమేష్, చందు అయ్యప్ప, స్టీవెన్‌బాబు, ఆర్.కోటేశ్వరరావు, సుబ్బారావు, పూలే రామ్, మల్లిఖార్జునరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

- రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ చొప్పర ప్రీతి, ఆది జాంబవ దళిత ఉద్యోగుల సేవా సమితి కార్యదర్శి ఉన్నం ఏహేస్కేల్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం అంబేడ్కర్ చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాతగా ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో యడ్లపల్లి రవికిరణ్, కొలకలూరు నాగేశ్వరరావు, శీలం వినయ్, టి.సాంబయ్య, కొలకలూరి పాపారావు, కొమ్ము రాయల్, పినపాటి అనిల్‌కుమార్, తదితరులు ఉన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి

తెనాలి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని గుర్రం జాషువా విగ్రహం వద్ద అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచి గుర్రం జాషువా విజ్ఞాన సమితి, తెనాలి బీజేఆర్ కమిటీ, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా పుష్పాంజలి ఘటించారు. అంబేడ్కర్ సేవలను స్మరించుకున్నారు. తొలుత అయితానగర్‌లోని లింగారావు సెంటరులో బీజేఆర్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పెద్దలతో కలసి అంబేడ్కర్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. మారీసుపేటలోని బీజేఆర్ కార్యాలయంలోనూ అంబేడ్కర్ జయంతిని జరిపారు. ఆయా కార్యక్రమాల్లో విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి డి.మధుబాబు, గుర్రం జాషువా విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి పి.రవి, బీజేఆర్ కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్, కోశాధికారి ఎన్.ప్రద్యుమ్న, కార్యదర్శి ఎస్.కమలకర్, అత్తోట శరత్, నలుకుర్తి రమేష్, కొండముడి రమేష్, ఇందుపల్లి రాజారామ్, వి.రత్నం పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవాట్రస్ట్ కార్యాలయంలో...

తెనాలి: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ 134వ జయంతిని సోమవారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ సేవాట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. సేవాట్రస్ట్ సభ్యులు అంబేడ్కర్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ట్రస్ట్ కార్యదర్శి దోమసందీప్ అధ్యక్షత వహించారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజర్లమూడి కృపాచారి అంబేడ్కర్ జీవిత విశేషాలను, ఆయన ఆశయాలను వివరించారు. తొలుత జల్లి గంటయ్య, కనపర్తి బెన్‌హర్‌లు ప్రార్థన గీతం ఆలపించారు. కార్యక్రమంలో కంచర్ల ప్రభుదాస్, పాములు దాసు, జముల్ రమేష్, బండికళ్ల సతీష్, అమృతలూరు రాంబాబు, బొల్లెద్దు సుబ్బారావు పాల్గొన్నారు. సేవాట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కనపర్తి అబ్రహాంలింకన్ పర్యవేక్షించారు.

అంబేడ్కర్‌కు సబ్‌కలెక్టర్ సంజనా సింహ నివాళి

తెనాలి: రాజ్యాంగ నిర్మాత 'భారతరత్న' బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరుపుకున్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి సబ్‌కలెక్టర్ వి.సంజనాసింహ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అంబేడ్కర్ జీవిత విశేషాలు, రాజ్యాంగ రచనలో ఆయన చేసిన కృషి, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా మనగలగటానికి ఆ రాజ్యాంగం దోహదపడిన తీరును సబ్‌కలెక్టర్ గుర్తుచేశారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర: ప్రస్తుత పరిస్థితుల్లో భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అదే డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కు ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఎం సీనియర్ నాయకులు మల్కా శివ సాంబిరెడ్డి, సర్పంచ్ పిల్లిరాధిక అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో ప్రధాని కోడలిలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధిక మాట్లాడుతూ అందరికీ విద్య ద్వారానే సమాజ మార్పు వస్తుందని అంబేడ్కర్ తెలిపినట్లు చెప్పారు. సిపిఎం మండల నాయకులు కోటా చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని వర్గాలు రాజ్యాంగం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఝాన్సీ, మంద్రు రాజు, పిల్లి గంగాధర్ యువత పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్దాం

తెనాలిఅర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం. లక్ష్మీపతిరావు, ఏసీపీ వాణి, ఆర్‌వో రాంప్రసాద్, సీఎంఎం విజయకుమారి, టీపీవో సాంబశివరావు, పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చినరావూరులో నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

- గంగానమ్మపేటలోని జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి సంస్థ వ్యవస్థాపకుడు కొలవరపు దేవానంద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని బోసురోడ్డులోని జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి ఓఎస్‌డీ యేసురత్నం,కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి, బందారు రవికాంత్, మేకల చిట్టిబాబు, ఆలపాటి వెంకట్రామయ్య, కన్నెగంటి మురళి, తదితరులు పాల్గొన్నారు.
- అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.
- కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు మాచిరాజు కృష్ణమూర్తి, నాయకులు నండూరి నారాయణ, వై.చింపయ్య, బెల్లకొండ హృదయరాజు, జి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

తెనాలిటౌన్: ఆటరానితనాన్ని రూపుమాపడంలో భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి ఎన్నలేనిదని బీజేపీ తెనాలి నియోజకవర్గ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ 134 జయంతి ఘనంగా నిర్వహించారు.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యర్రంరాజు సందీప్, బిట్రా కనకదుర్గ, ఎం.కనకదుర్గ, సిహెచ్.విజయభాస్కర్ రెడ్డి, డి.హనుమంతరావు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

- స్థానిక చినరావూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యూనివర్సల్ యూత్ అధ్యక్షులు, న్యాయవాది పిల్లి ప్రేమరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ మల్లిఖార్జునరావు, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకరరావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లోని ప్రముఖులను సన్మానించారు. అనంతరం పేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత, డాక్టర్ పుల్లారావు, పిల్లి వీరయ్య, బసవయ్య, కుర్రా శ్రీను, భూషణం, డేవిడ్, పిల్లి సాగర్, సుధాకర్, మధుకర్, పాల్గొన్నారు.
- స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఘనంగా నిర్వహించారు. సీఐటీయు తెనాలి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెనాలిరూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ హాలులో సోమవారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సెక్రెటరీ హరిదాసు గౌరీశంకర్, ఉపాధ్యక్షులు అన్నం పిన్నారావు, హై కోర్ట్ న్యాయవాది పెరికల డానియల్, న్యాయవాదులు దాసరి శ్రీధర్, ఎం.శ్రీనివాసరావు, గాజులవర్తి ప్రభాకరరావు, కొమ్ము అబ్రహం లింకన్, గోన పుణ్యవతి, పిల్లి సుధాకర్, మహేష్, అబ్దుల్ ఆరిఫ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే రాజ్యాంగాన్ని అందించిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు దక్కుతుందన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో..

టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. పినపాటి రవీంద్ర, అత్తోట శరత్ నలుకుర్తి రమేష్, మల్లవరపు విజయ్ కుమార్, మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో నివాళులర్పిస్తున్న నాయకులు, సర్పంచ్ రాధిక



మున్సిపల్ కార్యాలయంలో..



సీనియర్ సిటిజన్ నాయకుల ఆధ్వర్యంలో...



వీఎస్సార్ కళాశాలలో ...



జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో..



చినరావూరులో నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు



అంబేడ్కర్‌కు నివాళి అర్పించిన సబ్‌కలెక్టర్ సంజనా సింహ



కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు



కొలకలూరులో నివాళులర్పిస్తున్న సర్పంచ్ ప్రీతి, ఉన్నం ఏహేస్కేల్



అంబేడ్కర్‌కు నివాళి అర్పించిన సేవాట్రస్ట్ సభ్యులు



బస్‌స్టేషన్ సమీపంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పించిన దళిత సంఘాల నేతలు

క్లుప్తంగా

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

1250 గ్రాముల గంజాయి స్వాధీనం



తెనాలిరూరల్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని టూ టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 1250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ రాముల నాయక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గంజాయి విక్రయాలపై పక్కా సమాచారంతో ఆర్టీసీ బస్టాండ్ ఔట్ గేట్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద స్థితిలో ఉన్న తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పఠాన్ మహబూబ్ సుభాని, పొన్నూరు మండలం దండమూడి గ్రామానికి చెందిన గంజేరుపల్లి శ్రీవర్ధన్ అలియాస్ శ్రీహరిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితులు మద్యం, గంజాయి తాగడం వంటి దురలవాట్లకు బానిసలని, వారికి పొన్నూరుకు చెందిన షేక్ ఆసిఫ్ పరిచయమై గంజాయి విక్రయించేవాడన్నారు. వారు సేవించటంతో పాటు తెనాలి రైల్వేస్టేషన్, బస్టాండ్ పరిసర ప్రాంతాలలో విక్రయించి సొమ్ము చేసుకుంటారని, ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం కూడా ఆసిఫ్ వద్ద గంజాయి కొనుగోలు చేసి, 50 గ్రాముల పొట్లాలుగా చేసి, రూ 500 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకునేందుకు వేచి ఉండగా పోలీసులకు పట్టుబడ్డారు. తెనాలి డిప్యూటీ తహసిల్దారు సమక్షంలో నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ గంజాయి విలువ రూ 12,500 ఉంటుందని తెలిపారు. డీఎస్పీ బి. జనార్దనరావు సీఐతోపాటు సిబ్బందిని అభినందించినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఐ కొండయ్య, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రముఖ న్యాయవాది ఎస్‌బీ శివ మృతి



ఎస్‌బీ శివ (ఫైల్)

తెనాలి: ఎస్‌బీ శివగా పిలుచుకునే పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, పలు దేవాలయాల అనువంశిక ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు భాగవతుల శివసుబ్రహ్మణ్యం (62) సోమవారం సాయంత్రం మార్వాడిగుడి వీధిలోని స్వగృహంలో మృతిచెందారు. కొంతకాలంగా ఆయన అస్వస్థతతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తెనాలి బార్ అసోసియేషన్‌లో సభ్యుడిగా గత 35 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. పట్టణంలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాత శివాలయం, గోవర్ధనస్వామి ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయం, పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయానికి ఆయన అనువంశిక ధర్మకర్తగా బాధ్యతలు చూస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్‌లో ఉన్నారు. ఆ పార్టీ ఎన్నికల ప్రధాన ఏజెంటుగానూ బాధ్యతలు నిర్వర్తించారు. మంగళవారం ఆయన స్వగృహం నుంచి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, న్యాయవాదులు మేకల రవికుమార్, చింతా సురేష్ యాదవ్, పిల్లి విద్యాసాగర్, దాట్ల మోహనరెడ్డి, కేఎం విల్సన్ తదితరులు ఎస్‌బీ శివ మృతిపట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

ముదురుతున్న శ్రీవాసవీ దేవస్థానం కమిటీ వివాదం

తెనాలి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సత్రం కమిటీ సర్వసభ్య సమావేశంలో రేగిన వివాదం ముదిరి పాకాన పడుతోంది. ఆదివారం జరగాల్సిన సమావేశంలో టీడీపీకి చెందిన ఆర్యవైశ్యులు వివాదాన్ని లేవనెత్తటం, వారికి మద్దతుగా టీడీపీ కౌన్సిలరు తన అనుచరులతో సహా వచ్చి హల్‌చల్ చేయటం, పోలీసు బందోబస్తుతో సమావేశాన్ని వాయిదా వేయటం తెలిసిందే. సర్వసభ్య సమావేశమే జరగనప్పుడు టీడీపీకి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు సోమవారం తానే శ్రీవాసవీ దేవస్థానం సత్రం కమిటీ అధ్యక్షుడినంటూ స్వయం ప్రకటన చేసుకోవటం విస్తుగొలుపుతోంది. సోమవారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు చెప్పుకున్నారు. తన అధ్యక్షతన మంగళవారం ఉదయం పది గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని చెప్పారు. పాత పాలకవర్గం రద్దయిందనీ, వారికి ఎలాంటి అధికారాలు లేవన్నారు.

అవన్నీ అభూత కల్పనలు: దేవస్థానం కమిటీ

ఇదిలావుంటే, దేవస్థానం కమిటీ సభ్యులు మీడియా సమావేశంలో ఆదివారం రద్దయిన సర్వసభ్య సమావేశం తదుపరి ఎప్పుడు నిర్వహించేలా కమిటీ త్వరలోనే తెలియజేస్తుందని చెప్పారు. స్వయం ప్రకటనలు, సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం , పుకార్లను ఎవరు నమ్మవద్దని, వాటికీ దేవస్థానం కమిటీకి ఎలాంటి సంబంధం లేదని దేవస్థానం కమిటీ సభ్యులు ఆకి అచ్యుతరావు, వక్కల గడ్డ గంగాధర్ రావు, అన్నవరపు నరసింహారావు, వుప్పల వరదరాజులు, దేసు శ్రీనివాసరావు, మాలేపాటి హరిప్రసాద్, నూకల వెంకట భాస్కర్ రావు, గ్రంధి విశ్వేశ్వరరావు, గొడవర్తి సాయి హరే రామ్, కొణిజేటి శంకరరావు తదితరులు స్పష్టంచేశారు.

కూటమి పాలనలో బాలికలకు రక్షణ లేదు

- కుమార్తెపై తండ్రి లైంగికదాడి
- మరో బాలికపై గుర్తు తెలియని వ్యక్తి లైంగిక దాడికి యత్నం

తెనాలిరూరల్: కూటమి పాలనలో బాలికలకు రక్షణ లేకుండా పోతోంది. మద్యం మత్తులో కీచకుల్లా మారుతున్న సొంత కుటుంబ సభ్యులు, అపరిచిత వ్యక్తుల వల్ల చిన్నారుల జీవితాలు నాశనమవుతున్నాయి. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ఘటనలు బాలికల భద్రతను ప్రశ్నార్థకంగా మిగిల్చింది. తెనాలిలో ఒకేరోజు ఇద్దరు బాలికలపై కీచకులు నీచానికి తెగబడ్డారు. మండల గ్రామం గుడివాడలో, తెనాలి బుర్రిపాలెం రోడ్డులో బాలికపై లైంగిక వేధింపులు జరిగాయి. ఈ నీచానికి ఒడిగట్టిన వాళ్లలో ఒకడు కన్న తండ్రి కాగా మరో ఘటనలో అపరిచిత వ్యక్తి. రెండు ఘటనల వివరాలిలా ఉన్నాయి.

గుడివాడ గ్రామానికి చెందిన నాగేశ్వరరావు గుంటూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదాలు, వారంలో ఐదు రోజులు డ్యూటీకి వెళ్లి గుంటూరులోనే ఉండి, రెండు రోజులు మాత్రమే నాగేశ్వరరావు ఇంటిలో ఉండే పరిస్థితుల నేపథ్యంలో, భార్య తన పుట్టిల్లు అయిన దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో ఇరువురు కుమార్తెలతో ఉంటుంది. భర్త ఇంటికి వచ్చిన సమయంలో అప్పుడప్పుడు ఆమె కూడా వచ్చి వెళుతుంటుంది. మట్టల ఆదివారం పండుగ కావడంతో భార్య, పిల్లలు గుడివాడ వచ్చారు. నాగేశ్వరరావు పూటుగా మద్యం సేవించాడు. ఆదివారం రాత్రి ఒకే గదిలో అందరూ నిద్రించారు. సోమవారం వేకువజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు భార్య బయటకు వెళ్లగా, నాగేశ్వరరావు కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో ఇంట్లోకి వచ్చిన భార్య కేకలు వేయడంతో, చుట్టుపక్కల వారు వచ్చి నాగేశ్వరరావుకు దేహశుద్ధి చేశారు. ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై సోమ వారం పోక్సో నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వైద్యుల నుంచి వచ్చే నివేదిక ఆధారంగా సెక్షన్‌లు మార్చే అవకాశం ఉందని రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

మరో ఘటనలో ఓ మైనర్ బాలిక సోమవారం సాయంత్రం సైకిల్‌పై బుర్రిపాలెం వెళుతుండగా కంపోస్టు యార్డు దాటిన అనంతరం గుర్తు తెలియని వ్యక్తి అటకాయించాడు. బాలికను ఎత్తుకుని పొలాల్లోకి తీసుకెళుతుండగా ఆమె కేకలు వేసింది. పరిసరాల్లో ఉన్న వారు అక్కడికి చేరుకుని మృగాడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడు దుగ్గిరాలకు చెందిన బొక్కెన రవిగా గుర్తించారు. తాపీ పనులు చేసుకునే అతను పూర్తిగా మత్తులో ఉన్నాడు.

ఆకట్టుకున్న 'సాహితీ సూక్తం' నాటిక



సాహితీ సూక్తంలో సన్నివేశం

తెనాలి: డాక్టర్ వై ఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ఇక్కడి ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతున్న జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీలు మూడోరోజైన కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి స్వర్ణ సూర్య డ్రామా లవర్స్, హైదరాబాద్ వారి 'సాహితీ సూక్తం' నాటికను ప్రదర్శించారు. సమాజంలో మోసం చేయటం, మోసపోయిన వాళ్ల రకరకాల బాధలు అనుభవించటం జరుగుతూనే ఉంటుంది. కొందరు మోసపోయిన బాధతో ఆత్మహత్యతో జీవితాలను చాలిస్తున్న ఉదంతాలున్నాయి. మోసగించిన వారిని హత్య చేసినా, నిజంగా శిక్ష అనుభవించేవారు ఎవరు? అనే ప్రశ్నలు సహజం ఇలాంటప్పుడు సాహిత్యం బాధ్యత ఏమిటి... సామాజిక సమస్యలకు సాహిత్యం ఎటువంటి సమాధానం చెప్పాలనేది అంశాలను చర్చించిందీ నాటిక. ఉదయ్ భాగవతుల రచించిన ఈ నాటికకు ఆయనే దర్శకత్వం వహించారు. ఉదయ్ భాగవతులతోపాటు ద్వాదశి చంద్రశేఖర్, కార్తీక్ చట్రా, కుమారి, జాహ్నవి నటించారు. సంగీతం రమణ. నాటిక ప్రదర్శనకు ముందుగా ఆరిశెట్టి ఐశ్వర్య శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన ఆహుతులను అలరించారు. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో జరుగుతున్న ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి పిట్టు వెంకటకోటేశ్వరరావు పర్యవేక్షించారు.